## క్లుప్తంగా

### బారికేడ్లతో ప్రమాదాలు

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డులో సీఆర్పీఎఫ్ క్యాంపు ప్రధాన రహదారిపై భారీ కెడ్లతో ప్రతిరోజు వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ రెండు భారీ మలుపులు ఒకేచోట ఉండటం వల్ల తరుచూ పెద్ద వాహనాలు ఎదురుగా వస్తే ఎదురు వెళ్లే వెళ్లడం కష్టంగా మారుతుంది. ఇదే క్రమంలో బుధవారం బారికేడ్లు ఉన్న ప్రదేశంలో ఒకే సారి కారు, లారీ ఎదురెదురుగా వచ్చాయి. ఈ క్రమంలో సదరు కారు డ్రైవర్ కారును పక్కకి ఆపినప్పటికీ లారీ టైరు కారు తగలడంతో కారుకి వేనకాల కూడి వైపున ఉన్న ఓ భాగం ఊడిపోయింది. ఇదే విధంగా ఈ ప్రాంతంలో తరుచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని, అయినా పోలీసులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆ బారికెడ్లను వెంటనే అక్కడి నుంచి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

### మృతుడికి నివాళి

**మణుగూరుటౌన్:** మండలంలో అనారోగ్య కారణాలతో మృతి చెందిన వారి భౌతికకాయాలకు పూలమాలలు వేసి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నివాళులర్పించారు. మంగళారం మున్సిపాలిటీకి చెందిన రాజకీయయ నాయడు చిర్రా సోములు గౌడ్ గుండెపోటుతో మృతి చెందారు. అదేవిధంగా కొండాయిగూడెం గ్రామానికి చెందిన శివాలయ చైర్మన్ పన్నాల సమ్మిరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వారి మృతదేహాలకు నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ప్రఘాడ సానుభూతి వ్యక్తం చేసి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, కూచిపూడి బాబు, సామా శ్రీనివాసరెడ్డి, దొబ్బల వెంకటప్పయ్య, గణేశ్‌రెడ్డి, గాండ్ల సురేశ్, కోటేశ్వరరావు ఉన్నారు.

**పరామర్శ..**

**అశ్వాపురం:** మండల పరిధిలోని ఆనందాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ సొసైటీ డైరెక్టర్ బెల్లి శ్రీశైలం భార్య చిన్న మల్లమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. మల్లమ్మ మృతదేహానికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### క్వార్టర్ ఫైనల్స్‌కు 'యూసుఫ్ కప్'

**బూర్గంపాడు:** బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ బుధవారం క్వార్టర్ ఫైనల్స్‌కు చేరింది. బుధవారం జరిగిన మొదటి మ్యాచ్‌లో కొత్తగూడెంకు చెందిన ఫరీద్ ఎలెవన్ జట్టు, రెండవ మ్యాచ్‌లో అశ్వారావుపేట న్యూస్టార్ ఎలెవన్ జట్టు, మూడవ మ్యాచ్‌లో కొత్తగూడెం పండు స్ట్రయికర్స్ ఎలెవన్ జట్టు, నాల్గవ మ్యాచ్‌లో పాల్వంచ ఛేజింగ్ ఎలెవన్ జట్టు విజయం సాధించాయి. ఈ మ్యాచ్‌లలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు నిర్వహకులు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అందజేశారు.

### గ్రామసభల్లోనే ఎంపిక

**ములకలపల్లి:** ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక నిమిత్తం క్షేత్రస్థాయిలో గ్రామసభలు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా జలవనరుల అధికారి, మండల ప్రత్యేకాధికారి రమేష్ తెలిపారు. మండలకేంద్రంలోని రైతువేధికలో జీపీ కార్యదర్శులు, ఉపాధీ హామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో దిశానిర్దేశం చేశారు. కొత్త రేషన్ కార్డుల మంజూరీ, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, రైతు భరోసా తదితర పథకాల నిమిత్తం గ్రామసభలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకూ సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్థానికులు విధిగా హాజరుకావాలని సూచించారు, తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఎంపీడీఓ జి.రేవతి, ఏపీఓ హుస్సేన్, ఏఓ అరుణ్‌బాబు, పశువైద్యాధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం

**దుమ్ముగూడెం:** మండలంలోని నడికుడి పంచాయతీలోని డీ దంతెనం గ్రామంలో విద్యుత్ షార్ట సర్క్యూట్ వల్ల జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిళ్లతో పాటు ధాన్యం, పత్తి పంటలు దగ్ధమైన కారం చెంచయ్య కుటుంబాన్ని బుధవారం పీపీ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు. పీపీ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి పీపీ కృష్ణారావు సహకారంతో రూ.5 నగదును కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు వీరమాచినేని వినీల్ నేతృత్వంలో బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తెల్లం హరికృష్ణ, అంతోటి ప్రేమ్, దాట్ల రాజు, సుబ్బారావుపేట మాజీ సర్పంచ్ వర్సా చిన్నారావు, కారం బజార్, కొమరం గజేందర్ పాల్గొన్నారు.

### అభిప్రాయాలు తెలపండి

**ములకలపల్లి:** క్యూర్ కోడ్ స్కాన్ చేసి పోలీసులపై అభిప్రాయం తెలియజేయాలని ఎస్సై కిన్నెర రాజశేఖర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ తోపాటు పలుప్రాంతాల్లో క్యూఆర్ కోడ్ పోస్టర్లను బుధవారం అంటించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పోలీస్ సేవలు మరింతగా మెరుగు పరిచేందుకు క్యూఆర్ కోడ్ ఉపకరిస్తుందని అన్నారు. ఏఎస్సై పుల్లారావు, హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మణరావు, ప్రకాశ్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఊరూరా సంక్రాంతి సందడి

సంక్రాంతి పండుగ వేడుకలు ఊరూరా, ఇంటింటా సందడిగా సాగాయి. పర్వదినం పురస్కరించుకుని పిల్లలు, పెద్దలు వేకువ జామునే ఆనందోత్సాహాల నడుమ అభ్యంగన స్నానాలు చేసి, నూతన దుస్తులు ధరించారు. గంగిరెద్దుల విన్యాసాలు ప్రదర్శించాయి. ఇళ్ల ముంగిట్లో అందమైన రంగు రంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు, నవ ధాన్యాలతో చూపరులను ఆకట్టుకున్నాయి. యువతి, యువకులు, పిల్లలు పతంగులను ఎగుర వేసి విధుల్లో సందడి చేశారు. కొన్ని మారుమూల గ్రామాల్లో కోడి పందేలు సాగాయి. అటవీ ప్రాంతాలు కావడంతో వాటిని నిలువరించడం పోలీసులకు కష్టతరంగా మారింది. బుధవారం కనుమ సందర్భంగా ప్రజలు గోపూజలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్


చర్ల: ముగ్గుల పోటీలో మహిళలు, గ్రామస్తులు..


చంద్రుగొండ: రంగులు అద్దుతున్న చిన్నారి


చర్ల: సరిహద్దు అటవీ గ్రామంలో కోడిపందేలు


ములకలపల్లి: ఓ ఇంటి ఎదుట సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతూ ముగ్గు..


అశ్వారావుపేటరూరల్: తిరుమలకుంటలో బొమ్మల కొలువు..


దమ్మపేట: ఇంటి ముందర వేసిన ముగ్గు


చంద్రుగొండ: మంగయ్యబంజర్‌లోని పెద్దమ్మతల్లి గుడిలో భక్తుల పూజలు

# వైభవంగా పునర్వసు కల్యాణం

**దుమ్ముగూడెం:** మండలంలోని పర్ణశాలలో ఉన్న సీతారామచంద్రస్వామి దేవాలయంలో మంగళవారం పునర్వసు నక్షత్రం సందర్భంగా స్వామి వారికి పునర్వసు కల్యాణాన్ని నిర్వహించారు. ముందుగా స్వామి వారికి విశేష తిరుమంజనం నిర్వహించి సాంప్రదాయబద్ధంగా వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. వైభవంగా సాగిన ఈ కల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ పర్యవేక్షకులు సాయిబాబా, ఆలయ ఇన్‌చార్జ్ అనీల్‌కుమార్, ప్రధాన అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, ప్రతాపురం భార్గవాచార్యులు, శ్రీరంగం వెంకటాచార్యులు, నలదీగల నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


స్వామి వారికి పునర్వసు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

# అధ్వానంగా తాలిపేరు రహదారి

**చర్ల:** మండల కేంద్రమైన చర్ల నుంచి దోశిళ్లపల్లి మీదుగా తాలిపేరు ప్రాజెక్టుకు వెళ్లే మార్గంలో ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. ఏళ్ల తరబడిగా ఈ రహదారికి మరమత్తులు చేపట్టకపోవడంతో అధ్వానంగా తయారైంది. ఇక్కడ నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండల కేంద్రం నుంచి ఈ మార్గం గుండా నిత్యం దేవానగరం, దోశిళ్లపల్లి, కందిపాడు, తాలిపేరు ప్రాజెక్టు, ఉయ్యాలమడుగు, చెలిమెల, తిప్పాపురం, చెన్నాపురం, ఎర్రంపాడు గ్రామాలతో పాటు చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా జిల్లాలకు నిత్యం వందలాది మంది ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లలో ప్రయాణించే వారు అద్వానం ఉన్న రహదారితో తీవ్ర అవస్థలు పడుతున్నారు. చర్ల నుంచి తాలిపేరు ప్రాజెక్టు వరకు ఉన్న ఆరు కిలోమీటర్ల దూరంలో దోశిళ్లపల్లి నుంచి తాలిపేరు ప్రాజెక్టు వరకు ఉన్న కిలోమీటరు దారి మరింత ఇబ్బందికరంగా ఉంది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడి ఉండడం, వాటిలో పెద్ద పెద్ద బండరాళ్లు ఉండడంతో ప్రయాణాలు సాగిస్తున్న వారు అదుపు తప్పి కింద పడుతూ గాయాల పాలవుతున్నారు. మండల కేంద్రంలోనే ఉన్నట్లు ఉన్న ఈ రహదారిపై ఇటు అధికారులు గానీ అటు ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకున్న పాపాన పోకపోవడంతో ఈ మార్గం గుండా ప్రయాణించే వారి బాధలు వర్ణణాతీతంగా మారాయి. రహదారికి మరమ్మతులు చేయించేందుకు ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.


అధ్వానంగా ఉన్న చర్ల-తాలిపేరు రహదారి

# పథకాలపై సన్నాహక సమావేశం

**మణుగూరురూరల్:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న పథకాలపై బుధవారం మణుగూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల అధికారుల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి బి.నాగలక్ష్మి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోయే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాల కోసం లబ్ధిదారులను గుర్తించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 16వ తేదీ నుండి 20వ తేదీవరకు వెరిఫికేషన్, 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జాబితాపై గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భూభారతి రెవెన్యూ, ఇంటింటి సర్వే, ఉపాధిహామీ కార్డులు వంటి వివరాల ఆధారంగా వెరిఫికేషన్ చేయనున్నట్లు తెలిపారు. వెరిఫికేషన్ ప్రక్రియ అనంతరం ఈ నెల 26వ తేదీన లబ్ధిదారులకు పత్రాలు అందించడం జరుగుతుందన్నారు. మండల అధికారులు బాధ్యతతో విధులు నిర్వహిస్తూ వివరాలను సేకరించాలని ఆమె సూచించారు. సమావేశంలో మణుగూరు మండల ప్రత్యేక అధికారి సత్యప్రసాద్, తహసీల్దార్ వి.రాఘవరెడ్డి, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, మున్సిపాలిటీ అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది, ఐకేపీ, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగలక్ష్మి

### బీజేపీ మండల అధ్యక్షుడిగా రమేష్



**చర్ల:** బీజేపీ చర్ల మండల అధ్యక్షుడిగా రాళ్లగూడెంకు చెందిన నూపా రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా ఎన్నికల అధికారి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎన్నికైన రమేష్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళతానని అన్నారు. తనపై నమ్మకంతో పదవిని కట్టబెట్టిన పార్టీ పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులుగా లింగాపురంపాడుకు చెందిన ఎం డి.ఫాహీంను ప్రకటించారు.

# పర్యాటక కేంద్రంగా మార్చాలి



మాట్లాడుతున్న మాస్‌లైన్-ప్రజాంపంథా నాయకుడు మధుసూదన్‌రెడ్డి

**మణుగూరుటౌన్:** సాంబాయిగూడెం పేరంటాల చెరువును పర్యాటక కేంద్రంగా చేసి, మణుగూరు-బీటీపీఎస్ రోడ్లు, లైట్లు బాగు చేసి ప్రమాదాలు నివారించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాకతీయులు నిర్మించిన సాంబాయిగూడెంలోని పేరంటాల చెరువు చుట్టూ అడవులతో ఆహ్లాదకరంగా ఉంటుందని, చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా ఇక్కడికి వచ్చి విడిది ఏర్పాటు చేసుకుని సరదాగా గడిపి పోతుంటారని అన్నారు.

మణుగూరు-బీటీపీఎస్ వరకు రాత్రి వేళల్లో సైతం వాహనాల రాకపోకలతో రద్దీ అధికంగా ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని విజయనగరం-బీటీపీఎస్ వరకు లైట్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరారు. ఆర్ అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారై దుమ్ము, ధూళితో ప్రయాణించాలంటే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారిని బాగు చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలన్నారు. ఈ సమావేశంలో రామకృష్ణ, సంజీవరెడ్డి, జానయ్య, రాజేందర్, లక్ష్మణ్, యాకయ్య తదితరులు ఉన్నారు.

# హెల్మెట్ వినియోగంపై అవగాహన

**భద్రాచలంటౌన్:** రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజు రోజుకి పెరుగుతున్న నేపథ్యంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగం చేస్తే ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడుకోవడం సాధ్యమవుతుందని భద్రాచలం మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య సూచించారు. కూనవరం రోడ్డులోని రవాణ శాఖ కార్యాలయం వద్ద బుధవారం ద్విచక్ర వాహనదారులలో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాద సమయంలో తలకు హెల్మెట్ ఉండటం వల్ల తలకు గాయాలు కాకుండా ప్రాణాలు కాపాడుకోవడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

# గురుకులాల్లోనే పిల్లలను చేర్పించండి

**చర్ల:** తెలంగాణా రాష్ట్రం ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకులాల్లోనే పిల్లలను చేర్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని మండలంలో సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. మండలంలోని సత్యనారాయణపురం, తేగడ, చర్ల, గొంపల్లి, లింగాపురంలలో ముమ్మరంగా ప్రచారం కొనసాగింది. గురుకుల పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మి గురుకుల పాఠశాల విద్యార్థులతో కరపత్రాలను ప్రదర్శిస్తూ ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ.. పలు గ్రామాల్లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ గురుకులాల్లో 5వ తరగతి నుంచి కామన్ ఎంట్రన్స్ టెస్టు రాసి గురుకులాల్లో ప్రవేశాలు పొందాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చెన్నాపురానికి అటవీ మార్గమే దిక్కు!

- ఎమ్మెల్యే దత్తత గ్రామానికి అరణ్యమార్గమే శరణ్యం
- కాలినడకనే ప్రయాణం..
- దశాబ్దాలుగా నెరవేరని రహదారి కల
- అటవీ శాఖ అడ్డంకులే ప్రధాన సమస్య

**అశ్వారావుపేటరూరల్:** ఓ గిరిజన గ్రామానికి శాశ్వత రహదారి నిర్మించాలనే డిమాండ్ దశాబ్దాలుగా ముందుకు కదలడం లేదు. ఉమ్మడి రాష్ట్రం నుంచి పెండింగ్‌లో ఉన్న ఆ అడవి మార్గానికి స్వరాష్ట్రం ఆవిర్భావించి పదేళ్లుదాటినప్పటికీ మోక్షం లేదు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలోని పలు గిరిజన గ్రామాలకు వేళ్లాలంటే ఏపీ రాష్ట్రంలోని గ్రామాల బీటీ రోడ్లే దిక్కుగా మారాయి. ప్రస్తుతం ఆ గిరిజన గ్రామాన్ని స్థానిక ఎమ్మెల్యే దత్తత తీసుకొని ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో, ఈ సారైన ఈ మార్గానికి మోక్షం కలుగుతుందా? అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

అశ్వారావుపేట మండలంలోని మారుమూల దట్టమైన అటవీ ప్రాంతంలో గల చెన్నాపురం గ్రామానికి గాండ్లగూడెం నుంచి వెళ్లాలంటే అడవి కాలిబాటే దిక్కు. చెన్నాపురం గ్రామంలో 1982లో ఏర్పాటు కాగా,అంతా గిరిజనులే స్థిర నివాసం ఉంటున్నారు. ఈ గ్రామం జిల్లా, మండల కేంద్రానికి చివరి గ్రామం కాగా, మండల కేంద్రానికి సుమారు 25 కిలో మీటర్ల దూరంలో ఉంది. అయితే గాండ్లగూడెం నుంచి చెన్నాపురం వెళ్లేందుకు శాశ్వత రహదారి లేదు. ఈ మార్గంలో ఉన్న ఓ చిన్నపాటి వాగు ఒకటుంది. ఇది దాటుకుంటే స్థానికులు ప్రయాణం చేయాలి. వర్షాలు, వరదల సమయంలో వారి ప్రయాస వర్ణనాతీతం. ఈ నేపథ్యంలో ఇక్కడ వంతెన నిర్మించాల్సి ఉంది. దీంతో తోపాటు గాండ్లగూడెం-చెన్నాపురం మధ్యలో బీటీ రహదారి నిర్మిస్తే దూరాభారం తగ్గుతుంది.

**ఏపీ నుంచి వెళ్లాల్సిందేనా..?**

మండలంలోని గాండ్లగూడెం నుంచి చెన్నాపురం గ్రామానికి అడవి మార్గంలో వెళ్తితే 5 కిలోమీటర్ల దూరమే. కానీ రోడ్డు మార్గం లేకపోవడంతో చెన్నాపురం వెళ్లేందుకు గాండ్లగూడెం నుంచి అనంతారం, పండువారిగూడెం, దిబ్బగూడెం, రామన్నగూడెం(తెలంగాణ రాష్ట్రం) మీదుగా ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమల్లి మండలం రాచన్నగూడెం, వైఎస్ఆర్ కాలనీ, పూచికపాడు గ్రామాల మీదుగా చుట్టు తిరిగి 25 కిలోమీటర్ల దూరం ప్రయాణించి తిరిగి అశ్వారావుపేట మండలంలోని గోపన్నగూడెం, కంట్లం, కావడిగుండ్ల మీదుగా చెన్నాపురం గ్రామానికి వెళ్లాల్సి వస్తోంది.

చెన్నాపురంతోపాటు తెలంగాణలోని గోపన్నగూడెం, కన్నాయిగూడెం, కంట్లం, కావడిగుండ్ల, కొత్త కావడిగుండ్ల గ్రామాలకు వెళ్లాలన్నా.. ఏపీలోని గ్రామాలకు వెళ్లే రహదారే దిక్కు. గాండ్లగూడెం నుంచి రహదారి నిర్మిస్తే ఏపీ మార్గంపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. అలాగే గిరిజనులకు, ప్రయాణీకులకు దూరభారం అవస్థలు తప్పుతాయి.

**అటవీశాఖనే ప్రధాన సమస్య..**

గాండ్లగూడెం నుంచి చెన్నాపురం వెళ్లే అడవి మార్గం పూర్తిగా రిజ్వర్ ఫారెస్ట్ పరిధిలో ఉంది. ఈ ఐదు కిలో మీటర్ల దూరం వరకు ఉన్న అడవి మార్గం అంతా అటవీశాఖ పరిధిలోనే ఉండటంతో శాశ్వత రహదారి నిర్మాణానికి ఈ శాఖ అనుతులు ఉండాల్సిందే. దీంతో రోడ్డు నిర్మాణానికి దశాబ్దాలుగా అటవీ శాఖ ప్రధాన సమస్యగా కాగా, స్వయంగా రాష్ట్ర మంత్రి ఆదేశించిన నేటికి రహదారి నిర్మాణం సాధ్యం కావడం లేదు. తాజాగా ఎమ్మెల్యే దత్తత గ్రామం కావడంతో ఈ రహదారి సమస్యను రాష్ట్ర ఉన్నతాధికారులు, సీఎం దృష్టికి తీసుకెళ్లితే అడ్డంకులు తొలగే అవకాశాలు లేకపోలేవు.

**మంత్రి తుమ్మల నడిచిన కాలిబాట..**

గాండ్లగూడెం నుంచి చెన్నాపురం గ్రామానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రజాప్రతినిధి కాకముందు కాలిబాటలో వెళ్లి వచ్చే వారు. దశాబ్దాల క్రితమే మంత్రికి ఈ గ్రామానికి అనుబంధం ఉండేది. వ్యవసాయ పనులు, గిరిజనులపై మక్కువతో అడవి మార్గంలో కాలినడకన ఆయన రాకపోకలు సాగించే వారని, ఇప్పటికి స్థానికులు చెబుతుంటారు. స్వయంగా కాలినడకన, అడవి మార్గం కష్టాలను ప్రత్యేక్షంగా చూసిన మంత్రి.. ఈ కష్టాలను దూరం చేయాలనేదే తన చిరకాల కోరికగా చెప్పారు. గతంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రిగా(2015)లో తుమ్మల నాగేశ్వరరావు శాశ్వత బీటీ రోడ్డు నిర్మించేలానే ఉద్దేశంతో ఇదే మార్గంలో రెండు సార్లు క్వాన్‌వాయ్‌లో కూడా పర్యటించారు. ఈ పర్యటన సమయంలోనే కాలిబాట ఉన్న మార్గాన్ని ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు , కార్లు వెళ్లేందుకు కొద్ది దూరం తాత్కాలికంగా అభివృద్ధి చేయించారు. ఈ పర్యటన తర్వాత మంత్రి రోడ్లు భవనాల శాఖ అధికారులను శాశ్వత రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలని ఆదేశించారు. కానీ ఇప్పటివరకు అది నెరవేరింది లేదు.

**ప్రస్తుతం ఎమ్మెల్యే దత్తత గ్రామం..**

రాష్ట్ర మంత్రి తుమ్మల స్వయంగా కాలిబాటలో వెళ్లిన మార్గంలో ఉన్న చెన్నాపురం గ్రామాన్ని తాజాగా అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యుడు జారే ఆదినారాయణ దత్తత గ్రామంగా ఎంచుకున్నారు. దత్తత గ్రామంగా ప్రకటించిన కొద్ది రోజుల్లోనే చెన్నాపురం గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు పంచాయతీ రాజ్ శాఖ ద్వారా తొలి విడతలో సుమారు రూ.కోటి రూపాయాలు నిధులు కేటాయించి ఆయా పనులు మంజూరు చేశారు.

ఈ పనులకు శంకుస్థాపన చేసేందుకు ట్రాక్టర్ ట్రక్కులో కుర్చొని, వాగు దాటి వెళ్లారు. అంతే కాదు సంక్రాంతి నుంచి ప్రారంభించే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కూడా ఇదే గ్రామం నుంచి ప్రారంభిస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. తొలి విడతలోనే దత్తత గ్రామంలోని పేద గిరిజనులకు సొంతింటి కల నేరవేర్చాలని ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారు. కాగా, ఈ గ్రామానికి గాండ్లగూడెం నుంచి వెళ్లేందుకు ఉన్న అడవి మార్గాన్ని కుడా బీటీ రోడ్డుకు మార్చేందుకు ఎమ్మెల్యే జారే ప్రత్యేక దృష్టి సారిస్తే దత్తత గ్రామానికి సార్థకత చేకురుతుందని స్థానికుల అభిప్రాయం.

మంత్రి, ఎమ్మెల్యేలు కలుగజేసుకుని ఇప్పటికైనా శాశ్వత రోడ్డు మార్గాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


చెన్నాపురం వెళ్లే అడవి మార్గం మధ్యలో వాగు


ఆ గ్రామానికి అడవి మార్గంలో ప్రయాణిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు (ఫైల్)


వాగు దాటి దత్తత గ్రామం చెన్నాపురం వెళ్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ (ఫైల్)

### 19న మహాసభ

**మణుగూరురూరల్:** ఈ నెల 19వ తేదీన మహబూబాబాద్‌లో జరిగే తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) రాష్ట్ర రెండో మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి రాజేందర్‌లు మున్సిపల్ కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం సభ విజయవంతం కోసం నాయకులు గోడ పత్రికలు అంటించి, కరపత్రాల పంపిణీ చేస్తూ విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేడే కానుకను వాటర్ సప్లయ్ కార్మికులకు కూడా ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### కమిషనర్‌కు సన్మానం


కమిషనర్ దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

**అశ్వారావుపేటరూరల్:** ఆదాయ పన్ను చీఫ్ కమిషనర్ దంపతులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ముంబై చీఫ్ కమిషన్ పీర్యా నాయక్ అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామంలోని తమ బంధువుల ఇంటికి రాగా.. విషయం తెలుసుకున్న గ్రామ పెద్దలు, స్థానికులు కలిసి పీర్యా నాయక్ దంపతులను కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా దంపతులను శాలువా కప్పి ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బిర్రం వెంకటేశ్వరరావు, ఉప్పల మురళీ, ఉప్పల ప్రసాద్, లోకం సాంబశివరావు, రొయ్యల సత్యనారాయణ, బాణోత్ శ్రీనివాసరావు, బుడగం రవీంద్ర, జక్కుల నాగేశ్వరరావు, విక్రమ్ రెడ్డి, లకావత్ వెంకటేశ్వరరావు, బేతం రాము పాల్గొన్నారు.